శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న బండి రమేష్, తదితరులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించనున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరావు, గూడెపు నాగరాజు, గొట్టిముక్కల భాస్కర్‌రావు, సాధు ప్రతాప్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌కుమార్, చిత్త భాస్కర్, ప్రభాకర్, సతీష్, జగదీష్, సింగంశెట్టి రాజు, సునీల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాంటి నార్కొటిక్ విభాగం ఏడీజీపీ సందీప్ శాండిల్య

గచ్చిబౌలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డు విభాగానికి ఎంపికైన 377మంది కానిస్టేబుల్స్‌కి శిక్షణను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా యాంటి నార్కొటిక్ విభాగం ఏడీజీపీ సందీప్ శాండిల్య హాజరైజ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన కానిస్టేబుల్స్‌కు అభినందనలు తెలిపారు. శిక్షణ సమయంలో ప్రతి ఒక్కరు తమ శారీరక దృఢత్వం, మానసికస్థైర్యం, వృత్తి నైపుణ్యంతోపాటు క్రమశిక్షణ, ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగడం నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం 8వ బెటాలియన్ కమాండెంట్ ప్రిన్సిపాల్ సి.సన్నీ మాట్లాడుతూ అనుభవం కలిగిన శిక్షకులు, అధికారులు నేర్పే ప్రతి విషయం ఎంతో అమూల్యమైనవని వాటిని మనసు పెట్టి నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్లు సుబ్రమణ్యం, సహాయ కమాండెంట్లు డి.సత్యనారాయణ, దేవిదాస్ రాథోడ్, ఎం.రహేమన్, నారాయణదాసు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం



లింగంపల్లి రైల్వేబ్రిడ్జి వద్ద జరుగుతున్న బాక్స్‌కల్వర్ట్, వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ముంపు సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి బాక్స్ కల్వర్ట్, వరదనీటి కాల్వ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరదముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రూ.4కోట్ల నిధులతో చేపడుతున్న బాక్స్‌కల్వర్ట్, వరదనీటి కాల్వ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం పడిన ప్రతిసారి బ్రిడ్జి వద్ద వరదనీరు నిలిచి రాకపోకలు నిలిచిపోతున్నాయని దీంతో రోజుల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని బాక్స్‌కల్వర్ట్, వరదనీటి కాల్వ పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, మోహన్‌గౌడ్, హఫీజ్‌పేట, మాదాపూర్ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'విరగని అల' పుస్తకావిష్కరణ

మియాపూర్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పెమ్మరాజు విజయరామచంద్ర రాసిన విరగని అల కథల పుస్తకం తొలిప్రతిని గచ్చిబౌలిలోని ఆదిత్య డీఎస్ఆర్ క్లబ్‌హౌస్‌లో గురువారం కుటుంబ సభ్యుల మధ్య పెమ్మరాజు సుజాత, ప్రసాద్ దంపతులు ఆవిష్కరించారు. రచయిత విజయరామచంద్ర ఆయన సతీమణి కృష్ణవేణి చేతుల మీదుగా కుటుంబ సభ్యులు ప్రతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రచయిత విజయరామచంద్ర మాట్లాడుతూ అనుకున్న లక్ష్యం నెరవేడానికి ముందు అనేక ఆటుపోట్లు, ఆటంకాలు ఎదురైనప్పుడు వాటిని తట్టుకుని గమ్యం చేరడానికి స్ఫూర్తివంతమైన కథలను ఈ పుస్తకంలో పొందుపర్చామన్నారు. సుబ్బారావు, శ్రీనివాస్, బందకవి ఆనందకృష్ణ, నడింపల్లి విజయ్‌కుమార్, గణపతిరావు, శ్రీనివాసరావు, పవన్‌తేజ దంపతులు, ధరణిప్రగడ భానుమతి, శ్యామసుందరి, కీర్తి విజయలక్ష్మి కార్యక్రమంలో పాల్గొని రచయితను అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పత్రాలు అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హైదర్‌నగర్,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పంచమి కాలనీ ఏఎస్ జాన్సన్ అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్‌ను సంప్రదించారు. ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీంతో రూ. 2.50లక్షలకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం బాధిత కుటుంబ సభ్యులకు జగదీశ్వర్‌గౌడ్ అందజేశారు.

నందమూరి తారకరత్నకు నివాళి



తారకరత్నకు నివాళులర్పిస్తున్న బాలయ్య యువసేన ప్రతినిధులు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాలయ్య యువసేన ఆధ్వర్యంలో గురువారం నందమూరి తారకరత్న జయంతిని నిర్వహించారు. జేఎన్‌టీయూ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తారకరత్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, పాదాచారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అట్లూరి దీపక్, పవన్, రామకృష్ణ, ఆనంద్, పార్థు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి బిల్లుల జారీలో గందరగోళం

● నెలల తరబడి జాప్యం ● ఫోన్ యాప్ తెచ్చినా ఫలితం శూన్యం



మీటర్ రీడింగ్ ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్న రీడర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు జారీ చేస్తున్న నీటి బిల్లులు గందరగోళంగా మారాయి. మీటర్ రీడర్లతో బిల్లులు జారీ చేస్తే సమస్యలు తలెత్తుతున్నాయని భావించి ఫోన్ యాప్ తీసుకొచ్చినా ఫలితం ఉండడం లేదు. మీటర్‌రీడర్ నల్లామీటర్ ఫొటో తీసి వాటర్‌బోర్డు ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు సక్రమంగా రావడం లేదు. నెలల తరబడి ఆలస్యం చేయడంతో పాటు ఇష్టానుసారంగా బిల్లులు వేస్తున్నారు. అడ్డగోలుగా వస్తున్న బిల్లులను ఏ విధంగా చెల్లించాలని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని పలుప్రాంతాల్లో వాటర్‌బోర్డు నీటిసరఫరాతో పాటు బిల్లులు వసూలు చేస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని గృహ కనెక్షన్లకు నెలకు 20 వేల లీటర్ల వరకు తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. అంతకు మించి నీటిని వినియోగిస్తే బిల్లులు జారీ చేస్తున్నారు. ఇందుకోసం నీటి మీటర్లే ప్రామాణికంగా మారాయి. మెకానికల్ నీటి మీటర్‌తో సమస్యలు వస్తున్నాయని వాటి స్థానంలో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లను తీసుకొచ్చారు. గతంలో మీటర్ రీడర్లు ఇంటింటికీ వెళ్లి వీటిలో వచ్చే రీడింగ్‌ను ఈ-పాస్ మిషన్లలో నమోదు చేసి బిల్లు ఇచ్చేవారు. మీటర్ రీడర్లు తక్కువ రీడింగ్ నమోదు చేసి అవకతవకలకు పాల్పడుతున్నారని భావించి మొబైల్ యాప్ తీసుకొచ్చారు. మీటర్ రీడర్ ఇంటింటికీ తిరిగి ఏఎంఆర్ మీటర్ రీడింగ్‌ను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. డీజీఎం స్థాయి అధికారులు డివిజన్ల వారీగా మీటర్ రీడింగ్‌ను పరిశీలించి బిల్లు వేస్తారు. ఆ బిల్లును ఆన్‌లైన్‌లోనే పొందాల్సి ఉంటుంది. లేకుంటే మీటర్ రీడర్ మరోసారి రీడింగ్‌కు వచ్చినప్పుడు ఇస్తారు.

మీటర్ రీడర్ ఫొటో తీసి పంపినా బిల్లు రావట్లేదు

కమర్షియల్, గృహ కనెక్షన్ల మీటర్ రీడింగ్‌లను రీడర్లు ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నా అధికారులు వెంటనే పరిశీలించడం లేదు. రెండు, మూడు నెలల బిల్లులు ఒకేసారి ఇస్తున్నారు. చెల్లించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. దాంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మీటర్ రీడింగ్ కంటే అధికంగా బిల్లులు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో తమకు ప్రతి నెలా బిల్లు వచ్చేదని, ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

సెమిస్టర్ మధ్యలో తనిఖీలతో తంటానే..!

ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ఆవేదన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సెమిస్టర్ మధ్యలో జేఎన్‌టీయూ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తనిఖీలు చేయడం వలన తమకు తంటాలు తప్పడం లేదని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. అఫిలియేటెడ్ కళాశాలల యాజమాన్యాలతో గురువారం జేఎన్‌టీయూ అధికారులు ఏర్పాటుచేసిన సమావేశంలో కొన్ని కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫ్యాకల్టీని కొత్తగా తాము నియమించుకున్నప్పటికీ, సెమిస్టర్ మధ్యలో వారిని ఇతర కళాశాలల వారు రిలీవ్ చేయడం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో నూతనంగా నియమించుకున్న ఫ్యాకల్టీకి బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరగా, జేఎన్‌టీయూ అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాలేదని కళాశాలల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే తనిఖీల్లో భాగంగా.. ఆయా కళాశాలల్లో కొత్తగా ఏర్పాటుచేసిన ల్యాబ్‌లు, ఎక్విప్‌మెంట్, ఫ్యాకల్టీలను మాత్రమే ఎఫ్ఎఫ్‌సీలు తనిఖీ చేస్తాయని, ఇంతకు ముందే తనిఖీలు పూర్తయిన పాత భవనాలు, పాత ల్యాబ్‌లు, ఇతర మౌలిక సదుపాయాల జోలికి పోవన్నారు. అయితే, ప్రస్తుతం అంతగా డిమాండ్ లేని ఈసీఈ డిపార్ట్‌మెంట్ ల్యాబ్‌లకు రూ.25లక్షలతో ఎక్విప్‌మెంట్‌ను ఇప్పటికిప్పుడు ఏర్పాటుచేసుకోమని జేఎన్‌టీయూ అధికారులు చెప్పడం సమంజసంగా లేదని, ఈ విభాగంలో ఒకటి, రెండు ల్యాబ్‌లను తగ్గించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఒక కళాశాల చైర్మన్ వీసీని కోరగా, ఆయన ససేమిరా అన్నట్లు తెలిసింది. అలాగే, కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆచార్యుల కొరత ఉన్నందున ఏఐసీటీఈ నిబంధనల మేరకు ఎన్‌పీటీఈఎల్ కోర్సులు చేసిన ఈసీఈ, ఈఈఈ సిబ్బందిని సీఎస్ఈలో బోధనకు వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలని కోరగా, వీసీ నర్సింహారెడ్డి అంగీకరించారు.

ప్రిన్సిపాల్స్ అర్హతల సడలింపునకు వీసీ నో..

చాలా కళాశాలలకు ప్రిన్సిపాల్స్ కొరత ఉందని, అర్హతల విషయంలో సడలింపులు ఇవ్వాలని మేనేజ్‌మెంట్స్ కోరగా, ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్స్‌ను డైరెక్టర్లుగా నియమించుకోవచ్చని, అర్హతల విషయంలో ఏఐసీటీఈ రూల్స్‌ను పాటించాల్సిందేనని వీసీ స్పష్టం చేశారు. కాగా, గతంలో మాదిరిగా రాత్రివేళల్లో తనిఖీలు చేయబోమని, సాయంత్రం ఆరుగంటల్లోపే తనిఖీలు పూర్తిచేసేలా షెడ్యూలు రూపొందించామన్నారు. ఇప్పటికిపుడు అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకోలేని కాలేజీలు కోరితే.. జూన్ నెలలోనూ మరోమారు అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని వీసీ నర్సింహారెడ్డి హామీ ఇచ్చారు. ఎటువంటి డెఫిషియన్సీ లేని కాలేజీకు వెంటనే అఫిలియేషన్ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు బకాయిలు రాక, ఫ్యాకల్టీకి వేతనాలు ఇవ్వలేకపోతున్నామని. కాలేజీలకు వెంటనే బకాయిలు వచ్చేలా యూనివర్సిటీ వైపు నుంచి ప్రయత్నించాలని కొన్నికళాశాలల చైర్మన్లు వీసీని కోరారు. వీసీ స్పందిస్తూ.. ఇది తమ పరిధిలోని అంశం కాదని, అయినా యాజమాన్యాల నుంచి రిప్రెజెంటేషన్ ఇస్తే.. యూనివర్సిటీ తరఫున ప్రభుత్వానికి పంపుతానని చెప్పారు. రెక్టార్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ..ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు పూర్తయిన తర్వాత కూడా ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ముందుకు వస్తే యూనివర్సిటీ స్వాగతిస్తుందన్నారు. కొవిడ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆలస్యమవుతున్న విద్యా సంవత్సరాన్ని ముందుకు తెచ్చేందుకే ఈ ఏడాది ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను ఫిబ్రవరిలో చేపట్టాల్సి వచ్చిందన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అకడమిక్ ఆడిట్ అధికారులు తారాకళ్యాణి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలి: ఎమ్మెల్యే

మియాపూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న అన్నిప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం మియాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంచినీటి సరఫరా, యూజీడీ నిర్వహణపై జలమండలి అధికారులు, నియోజకవర్గ కార్పొరేటర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే తాగునీటిని వృథాకాకుండా లీకేజీలు లేకుండా అందరికి సమయపాలన పాటిస్తూ సరఫరా చేయాలని కోరారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు ప్రణాళికలు రూపొందించి ఆ ప్రాంతాలను కూడా ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థపై పూర్తిస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులరెడ్డి, జలమండలి అధికారులు జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, శరత్‌రెడ్డి, మేనేజర్లు సుబ్రమణ్యం, యాదయ్య, నరేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, పూర్ణేశ్వరి, సునీత, నాయకులు మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, మోహన్‌గౌడ్, చందానగర్ పార్టీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, హఫీజ్‌పేట అధ్యక్షుడు బాలింగ్ గౌతంగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలతో అరికట్టాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ మేడ్చల్ ఎస్ఈ డీఎస్ మోహన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో డీఈ చక్రవర్తి, ఏడీఈలు ప్రసాద్, హరికృష్ణ, ఏఈలు, ఇతర సిబ్బందితో ఎస్ఈ సమ్మర్ యాక్షన్ ప్లాన్ గురించి విపులంగా చర్చించారు. అలాగే ఎఫ్‌వోసీ (ఫ్యూజ్ ఆఫ్ కాల్) 24 గంటల పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిందే అన్నారు. ఎవరు ఎప్పుడు ఫోన్ చేసినా ఆన్సర్ చేయడమే కాదు, సంఘటనా స్థలానికి వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. విదుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. సెక్షన్ల వారీగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఎంత సమయంలో పరిష్కరించామన్న డేటా కూడా ఏఈ వద్ద ఉండాలన్నారు.

బాలానగర్ ఏసీపీకి కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు





ఏసీపీగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియ జేస్తున్న కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి,కూన సత్యంగౌడ్

బాలానగర్/హైదర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన హనుమంత్‌రావును కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి, ఎడ్లమోహన్‌రెడ్డి, మధూగౌడ్, సత్యపాల్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శివ, గోపీ ఏసీపీని కలిసి శాలువాతో సత్కరించారు.

రష్యాలో జరిగే యూత్ ఫెస్టివల్‌కు కిషోర్ ఎంపిక



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన కిషోర్

దుండిగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శంభీపూర్‌కు చెందిన వెన్నెలఫౌండేషన్ చైర్మన్ కిషోర్ చేస్తున్న సేవలకు గాను రష్యాలో జరిగే వరల్డ్ యూత్ ఫెస్టివల్ 2024కు ఎంపికయ్యారు. వరల్డ్ యూత్‌ఫెస్టివల్ ప్రారంభం అవుతోందని, కిషోర్‌కు రష్యా నుంచి మెయిల్ ద్వారా అప్లికేషన్ పంపించారు. దీంతో కిషోర్ చేస్తున్న స్పెషల్ సర్వీస్ గురించి వివరిస్తూ అప్లికేషన్ పెట్టుకున్నారు. కిషోర్ ఫౌండేషన్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలు 2018లో కేరళలో వరదలు వచ్చిన సమయంలో చేసిన సేవల గురించి అందులో వివరించారు. ఈ నేపథ్యంలో కిషోర్ గురువారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా కిషోర్‌ను ఆయన అభినందించారు.

కిందికుంట చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ కిందికుంట చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఒకప్పుడు రాళ్లు, రప్పలతో ఉన్న కిందికుంట చెరువుకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే గాంధీ సహకారంతో చెరువు సుందరీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. చెరువుచుట్టూ మురుగుకాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, చెరువు కట్ట బలోపేతం, వాకింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ విశ్వం, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రతన్‌నాయక్, కాంట్రాక్టర్ రతన్‌నాయక్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: కార్పొరేటర్

ఫతేనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్డులో డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాలలో పర్యటించి సమస్య పరిష్కారంపై అధికారులతో చర్చించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పైప్‌లైన్ రోడ్డులోని డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తే పలు బస్తీల డ్రైనేజీ సమస్య పూర్తిగా సమసి పోతుందన్నారు, కార్యక్రమంలో బస్తీ నాయకులు కరుణాకర్, కృష్ణచారీ, భూమారావు, వీరేశంగుప్త పాల్గొన్నారు.

ఖాజాగూడలో ప్రభుత్వ స్థలాల పరిశీలన

రాయదుర్గం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఖాజాగూడలో ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో స్థలాలను గురువారం శేరిలింగంపల్లి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను భూకబ్జాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

-కూకట్‌పల్లి, ఆంధ్రజ్యోతి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● బీఎస్ఎన్ఎల్ జీఎం రాజేశ్వరి

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టెలీకమ్యూనికేషన్స్ రంగంలో వీజీ సాంకేతికతను అమలు చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్టార్టప్‌లను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని వర్ధమాన ఇంజనీర్లకు సంగారెడ్డిలోని భారతీయ సంచార నిగం(బీఎస్ఎన్ఎల్) ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ డి.రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా రుద్రారం సమీపంలోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో హవానా పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సాంకేతిక కార్యక్రమాన్ని గురువారం జ్యోతి ప్రజ్వలనతో ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్‌లో తన ఇరవై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం, అందులో సాంకేతిక పరిజ్ఞానం ఎదిగిన తీరును రాజేశ్వరి వివరించారు. గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి మాట్లాడారు. సాంకేతికోత్సవంలో దేశంలోని 30 కళాశాలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏటీఐ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్య నిర్వహణాధికారి గంగాధర్, ఫీనిక్స్ గ్లోబల్ సహ వ్యవస్థాపకుడు ఆయుష్ గోస్వామి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో స్టార్టప్‌ల ఆవిష్కరణలపై సమావేశం

రాయదుర్గం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీలోని బయోనెస్ట్‌లో ఐకేఆర్ నాలెడ్జ్ పార్కుత్ కలిసి హైదరాబాద్‌లోని యూకో బ్యాంక్ స్టార్టప్‌ల ఆవిష్కరణలపై దృష్టి సారించే ఆరాబ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. స్టార్టప్‌లు, ఆర్థిక సంస్థల మధ్య అంతరాన్ని పూరించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని యూకో బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో నాలెడ్జ్ పార్కు ప్రతినిధులు డాక్టర్ విశ్వనాథం, డాక్టర్ అనిల్ కెరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాలు... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ రఫీక్(60)సూరారం పరిసర ప్రాంతంలో భిక్షాటన చేస్తుండేవాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లి వచ్చాడు. మల్లారెడ్డి ఆస్పత్రికి ఎదురుగా ఉన్న శిధిలావ్యస్థలో ఉన్న కాంప్లెక్స్‌లో తాడుతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు 100 డయల్‌కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్‌లో చేరిన ఐఎన్‌టీయూసీ నాయకుడు

బాలానగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఐఎన్‌టీయూసీ కార్మిక విభాగం నాయకుడు మామిళ్ల ఆనంద్ బాబు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్ ఆనంద్‌బాబుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు, కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ సభ్యులు గురువారం షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించనున్నందున కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

- షాపూర్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి)

శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఠాగూర్ రాజేందర్‌సింగ్ తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రంగనాథస్వామి ఆలయంలో

రాయదుర్గం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నానక్‌రాంగూడ రంగ్‌బాగ్‌లోని రంగనాథస్వామి ఆలయ బ్రహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకం, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఈ పూజల్లో పరిసర కాలనీల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.